క్లుప్తంగా

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏఓ నాగం కృష్ణ

పెద్దశంకరంపేట(మెదక్): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఏఓ నాగం కృష్ణ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులను హెచ్చరించారు. మంగళవారం పేటలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. విత్తనాలు కొనగోలు చేసినప్పుడు రసీదులు తీసుకోవాలని, పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, అఖిల్, వినీత్ తదితరులున్నారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో కల్యాణోత్సవంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చందంపేట మాజీ ప్రతినిధులు శివకుమార్, స్వామిరాజ్, మండల కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, రమేశ్‌గౌడ్, మోహన్ నాయక్, రామ్‌చంద్రం పాల్గొన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ తనిఖీ



ఈఎస్ఐ డిస్పెన్సరీలో మందులను పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పోతరాజుపల్లిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యం, మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత విషయంలో ఇబ్బందులు ఉన్నాయని రోగులు చెప్పారు. కార్మికులకు మంచి వైద్యంతో పాటు మందులు అందించాలని వైద్యులకు ఆయన సూచించారు.

ఆలయాలతో మంచి సమాజ నిర్మాణం



మాట్లాడుతున్న జగదీశ్వర్ నంద్ మహారాజ్

కొల్చారం(నర్సాపూర్): దేవాలయాల నిర్మాణంతో మంచి సమాజ నిర్మాణం అవుతుందని గిరిజన గురువు జగదీశ్వర్ నంద్ మహారాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని సంగారెడ్డి గ్రామ పంచాయతీ భీమ్లా నాయక్ తండాలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ నూతన ఆలయాల గడప పూజకు జగదీశ్వర్‌నంద్ మహారాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడికి గిరిజనులు ఆయనను ప్రత్యేకంగా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన తండా పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంజీబీఎస్‌కు ఎక్కువ బస్సులు నడపండి



సమస్యలు తెలుసుకుంటున్న డీఎం సురేఖ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా కేంద్రం నుంచి ఎంజీబీఎస్ వరకు ఎక్కువ బస్సులు నడిపించాలని ప్రయాణికులు డీఎంకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మెదక్ ఆర్టీసీ డీఎం కార్యాలయంలో మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ ద్వారా డీఎంకు వివరించారు.

చెక్కుల పంపిణీ

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్, మాజీ సర్పంచ్‌లు ఆకులపల్లి పాపయ్య, భూమ్‌రెడ్డి, రామచందర్, కాంగ్రెస్ మండల నాయకులు సాగర్, అనిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా భవన నిర్మాణ పనులు

మోడల్ పాఠశాలగా ముస్తాబు



పాఠశాల వరండాలో పెయిటింగ్, చిత్రాలు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రాథమిక పాఠశాల మోడల్ భవనంగా ముస్తాబవుతోంది. మండల కేంద్రం శివ్వంపేటలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం పునర్నిర్మాణం కోసం మన ఊరు– మన బడి ద్వారా నిధులు మంజూరు అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు చేసి వదిలేశాడు. ప్రస్తుతం తాత్కాలికంగా రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో బోధన తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ సరిపోను గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

32 లక్షలు మంజూరు

మన ఊరు– మన బడి ద్వారా పాఠశాలకు 32 లక్షల నిధులు మంజూరైనవి. పనులు దక్కించుకున్న సదరు గుత్తేదారుడు అసంపూర్తిగా భవన పనులు చేసి వదిలేశాడు. దీంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి నవీన్‌గుప్తా ముందుకొచ్చారు. తన సొంత నిధులతో అసంపూర్తి పాఠశాల భవనం పూర్తి చేసి, మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాడు. బోరుబావిలో మోటారు ఏర్పాటుతో పాటు టాయిలెట్స్, ఫర్నిచర్, తరగతి గదుల గోడలపై స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల ఫొటోలు వేయించడంతో పాటు విద్యార్థులకు బోధన సులువుగా అర్థమయ్యేందుకు వివిధ రకాల పెయింటింగ్ చిత్రాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు.



ముస్తాబు అవుతున్న పీఎస్ పాఠశాల

మోడల్ పాఠశాలగా చేస్తా



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం పనులు పూర్తి చేసి మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తున్న. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు సుమారు రూ.6 లక్షల సొంత నిధులు ఖర్చు చేశా. పనులు చివరదశకు చేరుకున్నాయి.

– నవీన్‌గుప్తా, దాత

దాతల సహాయం వెలకట్టలేనిది



ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు దాతలు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయం. వివిధ రకాల పెయింటింగ్ చిత్రాలతో శివ్వంపేట పీఎస్ పాఠశాల కొత్తకళ సంతరించుకుంది. ఇదే విధంగా ఇతర పాఠశాలలను ముస్తాబు చేసేందుకు దాతల సాయం తీసుకుంటాం.

– బుచ్చనాయక్, ఎంఈఓ

పట్టుదలతో ఆడితే విజయం ఖాయం



నర్సాపూర్: క్రీడాకారులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఇతర అధికారులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: గెలువాలన్న పట్టుదలతో ఆడితే విజయం ఖాయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీల ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను, ఆటలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గ్రామ, మండల, జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ జట్టు గెలువాలన్న పట్టుదలతో జట్టులోని క్రీడాకారులందరు కృషి చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తారన్నారు. క్రీడలతో ఏకాగ్రత పెరుగుతుందని దీంతో చక్కగా చదవగలుగుతారని వివరించారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. తోటి క్రీడాకారులను గౌరవించాలని, స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు అధికారులతో కలిసి ఆమె క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం వాలీబాల్ సర్వీసు చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, ఎంపీడీఓ మధులత, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమోద్దీన్, గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. సీఎం ఆర్ఎఫ్ పథకంతో అస్వస్థతకు గురై వైద్యం చేయించుకున్న కుటుంబాలకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని చెప్పారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు చంద్రాగౌడ్, రమణగౌడ్, గొర్రె వెంకట్‌రెడ్డి, రామాగౌడ్, తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడా పోటీలను మెదక్ ఎమ్మెల్యే రోహిత్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నీలిమా, ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మన్నన్, ఎంఈఓ పుష్పవేణి, హెచ్ఎం దీప్లారాథోడ్ పాల్గొన్నారు. అలాగే నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీలను మండల ప్రత్యేక అధికారి దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆశోక్, తహసీల్దార్ కరీం, ఎంఈఓ మురళిమోహన్ పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట(మెదక్): వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



రామాయంపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న చేస్తున్న నాయకులు



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

రామాయంపేట(మెదక్): పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 హామీలు, 420 పథకాలు అమలుచేయరా అని అన్నారు. కేసీఆర్ పరిపాలనలో రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఉపయోగపడే పథకాలు తీసివేశారన్నారు. రాష్ట్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి రూపురేఖలు మార్చడం ఎంత దారుణమని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, చెప్పిన పథకాలు అభివృద్ధిని చేసి చూపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను అవమానించిన సీఎం

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజల ఆకాంక్షను, తెలంగాణ తల్లిని సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని, తుగ్లక్ పాలన చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రంగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పర్కిబండలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి అవమనించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అర్జున్, మాధవరెడ్డి, వెంకటేష్, ఉప సర్పంచ్ రేణుకుమార్, నాయకులు రవి, వెంకట్‌గౌడ్, ఉదయ్‌రంజన్ గౌడ్, జీడిపల్లిలో వెంకటేష్, రతన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

శేరిపల్లిలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్ తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.అనంతరం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశం, స్వామి, యాదగిరి, శ్రీనివాస్, విఠల్, శ్యామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండలంలోని భాగిర్తిపల్లిలో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగరాజు, దయానంద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీకి గుర్తుగా తల్లిని మార్చారు

కొల్చారం(నర్సాపూర్): తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తుగా మార్చారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా అన్నారు. మండలంలోని చిన్నఘనాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లోని తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్ఎస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మండల యువత అధ్యక్షుడు సంతోష్‌రావు, రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడలు ప్రారంభం



పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సీఎంకప్ పోటీలు ప్రారంభం కానున్నాయని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణను పరిశీలించామన్నారు. మూడురోజుల పాటు జరిగే క్రీడా పోటీలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కచ్చితంగా ఉదయం 10 గంటల వరకు చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలకు రావాలన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఉన్నారు.

మనోహరాబాద్‌లో మొక్కుబడిగా క్రీడలు

పట్టించుకోని అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): సీఎంకప్ క్రీడలను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు జేఎంజే స్కూల్‌లో మంగళవారం మొక్కుబడిగా ప్రారంభించారు. కనీసం మండల కేంద్రంలో ఇలాంటి పోటీలు జరుగుతున్నాయనే సమాచారం తమకు లేదని ఆయా గ్రామాల యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పోటీలకు నాలుగైదు టీంలు మాత్రమే వచ్చాయంటే అధికారుల పని నిబద్ధత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకే రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీలు ముగిశాయి. మిగిలింది ఖోఖో గేమ్స్ మాత్రమే.



క్రీడలను వీక్షిస్తున్న అధికారులు



నిజాంపేట(మెదక్): జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు



రేగోడ్(మెదక్): కబడ్డీ ఆడుతున్న పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్

క్రీడలతోనే మానసికోల్లాసం

జిల్లాల్లోని అన్ని మండలాల్లో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసమని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీయడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు.



అల్లాదుర్గంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా



తూప్రాన్‌లో పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి



వెల్దుర్తి(తూప్రాన్): వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి ఆశావర్కర్లు పిలుపునివ్వడంతో మంగళవారం ముందస్తుగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.



మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్ట్ అయిన ఆశా వర్కర్లు



వెల్దుర్తిలో ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



పెద్దశంకరంపేటలో..

సంక్షిప్త వార్తలు

◆ **తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడాలి**



రేగోడ్(మెదక్): తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారసుల పేర్లపై ఉన్న ఆస్తి తిరిగి తల్లిదండ్రులకే అని తహసీల్దార్ నరేష్ మంగళవారం తెలిపారు. రేగోడ్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌రెడ్డి తన యోగక్షేమాలు చూడడానికి తన కుమారుడికి నెలకు రూ.5 వేలు ఇవ్వాలని కోరగా, కుమారుడు మైపాల్‌రెడ్డి ఒప్పుకోలేదు. అందుకు సంగమేశ్వర్ సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 చట్టం క్రింద యోగక్షేమాలు చూడనందున, కలెక్టర్ ఆదేశాలతో తన భూమిని తన కుమారుడు మహిపాల్‌రెడ్డి పేరు నుంచి తనపేరు పైన పట్టామార్పునకు దరఖాస్తు చేశాడు. కలెక్టర్ ఉత్తర్వులతో బుధవారం రిజిస్ట్రేషన్ చేసి, పట్టాపాస్ పుస్తకం అందజేశామని తహసీల్దార్ తెలిపారు.

◆ **వెల్దుర్తి ట్రాన్స్‌కో ఏఈని సస్పెండ్ చేయాలి**



తూప్రాన్: విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీజన్‌పై దాడికి పాల్పడిన వెల్దుర్తి ట్రాన్స్‌కో ఏఈపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర యునిటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం విద్యుత్ డీఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తి పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోల్‌టుపోల్ వర్కర్(ఆర్టీజన్) నర్సింగ్‌నాయక్‌పై విద్యుత్ సరఫరా విషయంలో గొడవపడి దాడి చేశాడన్నారు. దాడికి పాల్పడిన ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యునియన్ నాయకులు మహేందర్‌రెడ్డి, నర్సింలు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీపడొద్దు**

దుబ్బాకటౌన్: పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఏ మాత్రం రాజీపడొద్దని తహసీల్దార్ సంజీవ్ కుమార్ అన్నారు. మంగళవారం లచ్చపేట మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

కోనాయపల్లి(పీటి)లో కౌన్సెలింగ్ ఇచ్చిన ఐసీడీఎస్ అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): 18 సంవత్సరాలు నిండని వారికి వివాహాలు చేయొద్దని, వారికి కనీస వయసు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలని చైల్డ్ ప్రొటెక్ట్ అధికారులు(ఐపీపీఎస్) శంకర్, సరిత అన్నారు. మంగళవారం మండలంలోని కోనాయపల్లి(పీటి)లో 18 ఏళ్లు నిండని బాలికకు వివాహం నిశ్చయించిన సమాచారం మేరకు బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహతాబ్ ఆధ్వర్యంలో అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాలపై జరిగే అనర్థాలను వారికి వివరించారు. అనంతరం బాల్యవివాహం చేయ్యమని వారితో రాతపూర్వక హామీ తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



కోనాయపల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు